




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



జిల్లా నేతల్లో.. సర్వే గుబులు!

- జిల్లాలో రహస్య సర్వేపై ఆశావహ నేతల్లో గుబులు
- ప్రధాన పార్టీల బలాబలాలపై అంచనాలు
- సర్వే ఫలితాల ఆధారంగానే నేతల రాజకీయ భవిష్యత్తు
- దీటైన అభ్యర్థిని పార్లమెంట్ ఎన్నికల బరిలో దింపేందుకు వేట
- లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్న ప్రధాన పార్టీలు
- జిలావ్యాప్తంగా రోజురోజుకూ మారిపోతున్న రాజకీయ సమీకరణలు





ఆదిలాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు సమీపించడంతో ప్రధాన పార్టీలన్నీ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నాయి. దీటైన అభ్యర్థిని ఎన్నికల బరిలో దింపేందుకు వేట మొదలు పెట్టాయి. దీంతో అన్ని పార్టీలలోకి వలసలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్, ఇతర పార్టీలు అభ్యర్థులపై అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో టికెట్ కోసం తీవ్రమైన ఉత్కంఠ కొనసాగుతోంది. ఇప్పటికే బీజేపీ తొలి జాబితాను విడుదల చేసినప్పటికీ.. జిల్లా నేతలకు చోటు దక్కలేదు. అలాగే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల అభ్యర్థులు దాదాపుగా ఖరారైనా.. అధికార ప్రకటన కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. చివరి వరకు వేచి చూసే ధోరణితోనే పార్టీలు కనిపిస్తున్నాయి. అయితే రహస్య సర్వేతో ప్రధాన పార్టీల నేతలకు ఫీవర్ పట్టుకుంది. సర్వే ఫలితాలు ఎలా ఉంటాయోనని సిట్టింగ్ ఎంపీతో పాటు ఆశావహ నేతలు ఆరా తీస్తున్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అవకాశం దక్కుతుందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సర్వేలను తమకు అనుకూలంగా మార్చుకుంటున్న కొందరు నేతలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో జిల్లాలో రోజురోజుకు రాజకీయ సమీకరణలు వేగంగా మారిపోతున్నాయి. త్వరలోనే లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూలు విడుదలయ్యే అవకాశం ఉండడంతో సర్వేలకు మరింత ప్రాధాన్యత ఏర్పడుతుంది. అయితే, ప్రధాన రాజకీయ పార్టీల టికెట్ కోసం పదుల సంఖ్యలో ఆశావహ నేతలు పోటీ పడుతున్నారు. సర్వే ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేసేందుకు పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. అయితే టికెట్ లక్కు ఎవరికి దక్కుతుందోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

పార్టీల బలబలాలపై ఆరా

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజక వర్గాల్లో ప్రధాన పార్టీల బలబలాలపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తుంది. ఏ పార్టీ నుంచి ఎవరు బరిలో ఉంటే గెలుపు సులువవుతుందనే దానిపై ప్రత్యేకంగా సర్వే బృందాలు దృష్టిని సారిస్తున్నాయి. సిట్టింగ్ ఎంపీకి ప్రత్యామ్నాయంగా ఎవరైతే బాగుంటుందనే అభిప్రాయాలను కూడా సేకరిస్తున్నట్లు తెలుస్తుంది. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో బీజేపీకి ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్సే అన్నట్లుగా కనిపిస్తోంది. బీఆర్‌ఎస్ మూడవ స్థానానికే పరిమితమవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏ పార్టీ నుంచి ఎవరు బరిలో ఉంటే గట్టి పోటీ ఉంటుందన్న దానిపై కూడా ఆరా తీస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో నాలుగు నియోజక వర్గాలు బీజేపీకి అనుకూలంగా ఉండగా.. రెండు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్, ఒక్క నియోజకవర్గంలో మాత్రమే కాంగ్రెస్ హవా కనిపిస్తోంది. అయితే అన్ని పార్టీలలో దాదాపుగా వర్గపోరు సాగుతోంది. దీంతో ఆశావహ అభ్యర్థులకు తలనొప్పులు తప్పవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల వరకు ప్రధాన పార్టీలలో మరిన్ని మార్పులు చేర్పులు జరిగే అవకాశం కనిపిస్తోంది.

ప్రజల మధ్య ఉండేలా ప్లాన్

టికెట్‌ను ఆశిస్తున్న వారంతా నిత్యం ప్రజల మధ్య ఉండేలా ప్లాన్ చేసుకుంటున్నారు. ఏదో ఒక కార్యక్రమం పేర్ది ప్రజల్లోకి వెళ్తున్నారు. పరామర్శలు, శుభకార్యాలు, కష్టసుఖాలు, క్రీడాపోటీలు, సేవా కార్యక్రమాలతో ముందుకెళ్తున్నారు. తమకంటూ ఓ క్యాడర్ ఉందంటూ నిరూపించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజల్లోకి దూసుకు పోయేందుకు ప్రయత్నిస్తూనే.. అధిష్ఠానం పెద్దలతో తరచుగా టచ్‌లో ఉంటున్నారు. అభ్యర్థుల ఎంపిక తుదిదశకు చేరుకోవడంతో నేతలంతా హైదరాబాద్, ఢిల్లీలోనే మకాం వేస్తూ చివరి ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నేతలు వివిధ కార్యక్రమాలను చేపడుతూ నిత్యం ప్రజల్లోకి వెళ్తుండగా.. బీఆర్‌ఎస్ నేతలు మాత్రం కొంత సైలెంట్‌గానే కనిపిస్తున్నారు. కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఎంపీ టికెట్‌పై ఆశలు పెట్టుకుని విధులకు దూరంగా ఉంటూ ప్రజలతో మమేకమవుతున్నారు. నియోజక వర్గాల్లో మంచి పలుకుబడి ఉన్న ప్రజాప్రతినిధులతో పాటు ఇతర నేతలను తమవైపుకు తిప్పుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.



అంతా సర్వే మయం

అన్ని పార్టీలలో ఆశావహ నేతల జాబితా ఎక్కువ కావడంతో సర్వేల ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక ఉంటుందని అధిష్ఠానం పెద్దలు సంకేతాలు ఇవ్వడంతో ఇక నేతల భవిష్యత్తు సర్వే ఫలితాల పైనే ఆధారపడి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతీ నియోజకవర్గంలో తమకంటూ ఓ క్యాడర్ ఉండేలా నేతలు జాగ్రత్త పడుతున్నా.. సర్వే నివేదికలు ఎలా ఉంటాయోనన్న ఆందోళన కనిపిస్తోంది. అభ్యర్థుల ఎంపికకు ఎమ్మెల్యేల అభిప్రాయం కూడా ప్రధానమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, సీనియర్ నేతలు అధిష్ఠానం పెద్దలకు తమ అభిప్రాయాన్ని కూడా చెప్పినట్లు తెలుస్తుంది. అంతేకానీ ప్రధాన పార్టీలన్నింటిలో నేతల మధ్య ఏకాభిప్రాయం కుదిరినట్లు కనిపించడం లేదు. చివరకు అధిష్ఠానం పెద్దల నిర్ణయమే ఫైనల్ అన్నట్లుగా తెలుస్తుంది. ఎవరికి వారే సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేసుకుంటున్నా.. నేతలు అధిష్ఠానం దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీ అధిష్ఠానం పెద్దల ఆశీస్సులు ఉండేలా ప్రయత్నాలు చేస్తున్నారు. చివరకు సర్వే ఫలితాలు సరిగా లేవంటూ చెప్పి తప్పించుకునేందుకే పార్టీలు సర్వేలు చేపడుతున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉండాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 12: రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు జిల్లా కలెక్టర్లు అన్ని ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ విషయమై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు జాబితా పై వచ్చిన అన్ని ఫిర్యాదులను విచారణ జరిపి ఎలాంటి తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ముద్రణకు ప్రింటింగ్ ప్రెస్‌ను ముందే గుర్తించాలని, పార్లమెంట్ ఎన్నికల్లో హోమ్ ఓటింగ్ ప్రక్రియ సక్రమ నిర్వహణకు సరైన ప్రణాళిక ముందు నుంచి సిద్ధం చేసుకోవాలని, ఈ విషయంలో ఎలాంటి తప్పులు చేయవద్దన్నారు. పోలింగ్ రోజ్ రికార్డింగ్ కోసం సరైన వెబ్ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అంతేకాక ఎన్నికల నోటిఫికేసన్ వెలువడినప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా అవసరమైన వీడియో సర్వేలెన్స్, వీడియో వీక్షణ, తదితర పనుల కోసం అవసరమైన కెమెరాలను ముందే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వ్యతిరేక వార్తలకు ఎప్పటికప్పుడు స్పందించి ఎన్నికల సంఘానికి పంపించే బాధ్యతను జిల్లా కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మోడల్ పోలింగ్ కేంద్రాలను బాగా తీర్చిదిద్దారని, అదేవిధంగా పార్లమెంట్ ఎన్నికలలో సైతం మంచి మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఇందుకు ముందే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, మోడల్ పోలింగ్ కేంద్రాల పై విస్త్ర ప్రచారం కల్పించాలన్నారు. ఆర్వో కార్యాలయంతో పాటు, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో కమ్యూనికేషన్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సమాచారాన్ని ఈనెల 13లోగా పంపించాలని, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది డేటా అప్డేషన్‌పై ప్రత్యేకదృష్టి కేంద్రీకరించాలన్నారు. ఆ తర్వాత అడిషనల్ సీఈవో లోకేష్, సర్ఫరాజ్ అహ్మద్‌లు మాట్లాడుతూ ఓటరు జాబితా పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ స్టేషన్లో మౌలిక సదుపాయాలు, వివిధ రకాల నోడల్ టీములకు ఇచ్చే శిక్షణ కార్యక్రమాలు, ఎన్నికల వెలువడిన తర్వాత ప్రతిరోజు సమర్పించే నివేదికలు, పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే మీడియా సమావేశం, పొలిటికల్ పార్టీలకు సమాచారం, డీపేస్‌మెంట్, అనుమతులు, ఫిర్యాదుల పరిష్కారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, సెక్టోరల్ అధికారుల నియామకం,హోమ్‌ఓటింగ్, నామినేషన్ల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదతర అంశాలపై వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజార్షిషా, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ట్రైనీ కలెక్టర్ వికాస్‌మెహత, తదతరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉద్యోగమేళా

ఉట్నూర్, మార్చి 12: మండలకేంద్రంలోని కొము రంభీం ప్రాంగణంలో బుధవారం నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఐటీడీఏ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతి యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ జాబ్‌మేళాకు 15 ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని, నిరుద్యోగ యువతీ, యువకులు హాజరు కావాలని అన్నారు. వైటీసీలో ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తి ఉన్న గిరిజన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీవో పేర్కొన్నారు.

..లక్ష్మీనారాయణ స్వామి ఆలయ భూముల వేలం

జైనథ్, మార్చి 12: మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయానికి సంబంధించిన భూముల వేలాన్ని బుధవారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వామన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. జైనథ్ గ్రామానికి చెందిన రైతులు బహిరంగ వేలంలో 2024-25 సంవత్సరానికి గాను దారవత్తు సొమ్ము రూ.20వేలు ముందుగా చెల్లించాలన్నారు. ఇందుకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై బహిరంగ వేల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఈవో పేర్కొన్నారు.

.. విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక

తాంసి, మార్చి 12: తాంసి, తలమడుగు, భీంపూర్ మండల విద్యుత్ వినియోగదారులకు బుధవారం సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారి నజీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ పరిష్కార వేదికను మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యను ఈ వేదికలో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని తాంసి, భీంపూర్, తలమడుగు, మండలాల వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

'ఫౌండేషన్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి'

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 12: ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచితంగా అందించే ఫౌండేషన్ కోర్సులను సద్వినియోగం చేసుకుంటు పోటీ పరీక్షల్లో రాణించాలని దళిత అభివృద్ధి అధికారి సునితకుమారి అన్నారు. స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన జ్యోతి, సుష్మ ఇద్దరు ఇటీవల విడుదలైన గురుకుల ఫలితాల్లో నాలుగు ఉద్యోగాలు సాధించారు. కాగా వారిని మంగళవారం ఎస్సీ స్టడీ సర్కిల్‌లో దళిత అభివృద్ధి అధికారి సునిత, డైరెక్టర్ డాక్టర్ రమేష్‌లు సన్మానించారు. 2017, 2019లో జ్యోతి, సుష్మశాలు ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందారని దళిత అభివృద్ధి అధికారి సునిత కుమారి తెలిపారు. ఇటీవల విడుదలైన గురుకులాల ఫలితాల్లో జ్యోతి డీఎల్, జెఎల్, పీజీటీ, టీజీటీ సాధించగా సుష్మ జెల్, టీజీటీ, పీజీటీ ఉద్యోగాలకు అర్హత సాధించారని తెలిపారు. ఇక్కడి శిక్షణతో ఎంతోమంది కొలువులు సాధించారని, యువత ఇక్క డి శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.



12,13)సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా



14)సమావేశంలో పాల్గొన్న ఆయా శాఖల అధికారులు

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ చూపాలి

- జిల్లా కలెక్టర్ రాజార్షిషా
- కలెక్టరేట్‌లో ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, వసతి గృహ సంక్షేమ అధికారులతో సమావేశం

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 12: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలలోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, తాగునీటి వసతి, బియ్యం, ఇతర ఆహార పదార్థాల నాణ్యతపై జిల్లాలోని అన్ని ఆశ్రమ పాఠశాలల, గురుకులాల ప్రధానోపాధ్యాయులు వసతి గృహ సంక్షేమ అధికారులతో కలెక్టర్ ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో గల అన్ని ఐటీడీఏ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో గురుకుల పాఠశాలలో కావాల్సిన అవసరమైన మౌళిక సదుపాయాలపై ప్రతి స్కూల్‌కి సంబంధించిన అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాగునీటిని, మిషన్ భగీరథ ద్వారా సరఫరా చరేయాలని, ఆర్వోప్లాంట్స్ రిపేర్స్ ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని, ఎక్కడ కూడా ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించి ఎప్పటికప్పుడువిద్యార్థుల వారి ఆరోగ్యంపై ఆరా తీయాలని, ప్రతీ గురువారం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్స్ ఫీల్డ్ విజిట్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే అనారోగ్యం, ఎనిమియాతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్యం అందించాలని అన్నారు. ప్రతీ మొదటి గురువారం ఒక స్కూల్ పర్యటించి మినిమం విద్యార్థులను పరీక్షించి మిగిలిన విద్యార్థులను మరుసటి గురువారం పరీక్షించాలని తెలిపారు. షెడ్యుల్ తయారు చేసుకొని ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలని ఆదేశించారు. అలాగే ఐదు పీహెచ్‌సీలలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళ కేంద్రాలు, ప్రతీ మంగళవారం క్యాంపులు నిర్వహించి ఆరోగ్య కార్డులు అందించాలని అన్నారు. అలాగే ఆహార విషయంలో ప్రత్యేకశ్రద్ధ వహించి నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, సివిల్ సప్లయి ద్వారా సరఫరా చేస్తున్న ఫ్యూరీఫైడ్ బలవర్ధకమైన బియ్యాన్ని వృదాకాకుండా పదిహేను నిమిషాలు బియ్యం నానబెట్టడం వల్ల పైన తేలుతున్న బియ్యం కలిసిపోతాయని, దీనివల్ల మంచి పోషకాలు అందుతాయని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయి శాఖ నుంచి స్కూల్‌లో శిక్షణ ఇవ్వాలని, ఇందులో ప్రతీఒక్కరు పాల్గొనేలా చూడాలన్నారు. అలాగే, ప్రతీ హాస్టల్‌లో తాగునీరు, ఆరోగ్యం, ఆహార విషయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని నాణ్యమైన సరుకులు అందించాలని తెలిపారు. పెండింగ్ పనులు మరమ్మతులు ఏమైనా ఉంటే ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. ఇందులో ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలి

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఏకగ్రీవ తీర్మానం



సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

ఉట్నూర్, మార్చి 12: మండలస్థాయి అధికారులు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరు కాక పోవడానికి నిరసిస్తూ సభ్యులు గైర్హాజరు అయిన అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ ఏకగ్రీవ తీర్మాణం చేశారు. మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ బాలాజి, ఎంపీటీసీలు జాదవ్ గోపాలరావు, జాదవ్‌మోహన్‌సింగ్, శారదబలిరాం, కొడప అనసూయలు మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశాలకు అధికారులు హాజరు కాక పోవడం విచారకరమని, అధికారులు రానప్పుడు సమస్యలు ఎవరికి చెప్పాలని పేర్కొంటూ వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు తీర్మానం పంపించాలని కోరడంతో ఎంపీపీ ఆమోదించారు. ఇదిలా ఉండగా ఎండలు ముదురుతున్నందున ప్రజలకు మంచినీటి అవసరాలు తీర్చాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎంపీపీ, వైస్ ఎంపీపీలు అన్నారు. గ్రామీణ నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల మండలంలోని శామ్పూర్‌లో ట్యాంక్ నిర్మించి ఏళ్ల గడుస్తున్నా.. పైపులైన్లు వేయలేదని అన్నారు. షాంపూర్ ప్రధాన రహదారిపై ఉన్న 150 గృహాల ప్రజలకు నల్ల కనెక్షన్లు ఇవ్వలేదన్నారు. ప్రతి సమావేశంలో పేర్కొంటున్నప్పటికీ.. కాగితాల వరకే పరిమితం చేస్తున్నారని వారు ఆరోపించారు. పక్షం రోజుల్లోగా పనులు పూర్తిచేసి నీళ్ల వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఏఈఈ సురేందర్ వివరించారు. ఉట్నూర్ పట్టణంలోని అంగడి బజార్ ప్రాంతంలో ఐదేళ్లుగా నీరు రావడం లేదని డీసీసీబీ డైరెక్టర్ సామ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నర్సాపూర్, అడగూడ గ్రామాలలో తాగునీటి సౌకర్యం ఇబ్బందులు ఉన్నాయని ప్రత్యేక అధికారి విశ్వనాథ్ అధికారుల దృష్టికి తెచ్చారు. దొంగచింతలో ట్యాంకు ఉన్నా.. ఫలితం లేదని ఎంపీటీసీ కొడప అనసూయ అన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల సెక్రెటరీలు నీటిఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని, ముందస్తు సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసినా.. కార్యదర్శిలు స్పందించడం లేదని అన్నారు. వచ్చే మీటింగ్‌లో కార్యదర్శిలను కూడా మండల సమావేశానికి రప్పించాలని సభ్యులు, ఎంపీపీ, ఎంపీడీవో మాడుగుల మురళీధర్‌శర్మకు సూచించారు. మండలానికి 23 పాఠశాలలు మన ఊరు-మనబడి పథకం ద్వారా మంజూరు అయ్యాయని, ఇప్పటికీ ఐదు పాఠశాలల భవనాలు పూర్తి చేసి ప్రారంభోత్సవాలు నిర్వహించడం జరిగిందని ఎంఈవో గంగుల శ్రీనివాస్ తెలిపారు. మరో 18 పాఠశాలల పనులు జరుగుతున్నాయన్నారు. ఆతర్వాత వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, మహిళ శిశు సంక్షేమ శాఖ, పశు సంవర్ధక శాఖ అంశాలపై సమావేశంలో చర్చలు జరిగాయి.

రిమ్స్ కార్మికులతో కాంట్రాక్టర్ చర్చలు విఫలం

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 12: జిల్లాకేంద్రంలోని రిమ్స్ ప్రధాన ద్వారం ఎదుట రిమ్స్ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం నాల్గవ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమ్మె విరమించాలని రిమ్స్ కాంట్రాక్టర్ వేణు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. కార్మికులకు కాంట్రాక్టర్ డీఎంఈ సర్క్యులర్ ప్రకారం పూర్తి స్థాయిలో వేతనాలు చెల్లిస్తేనే సమ్మె విరమిస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ స్పష్టం చేశారు. ఈ నెల నుంచే మీరు తీసుకున్న అగ్రిమెంట్ ప్రకారం జీవో ఎంఎస్ 60 ప్రకారం వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ అన్ని సౌకర్యాలు కల్పిస్తానని కలెక్టర్ లేదా రిమ్స్ ఆధ్వర్యంలో రాతపూర్వకంగా రాసిఇస్తేనే సమ్మె విరమిస్తామని, లేదంటే విరమించమని చెప్పడంతో కాంట్రాక్టర్ ఒప్పుకోలేదు. దీంతో చర్చలు విఫలమయ్యాయి. కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. ఇందులో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ ముజీబ్, రిమ్స్ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాసీం, అధ్యక్షురాలు జీ.సంగీత, సంఘం సీనియర్ నాయకులు ఏఎవో లస్మక్క, కమలమ్మ, గంగామణి, రవి, రాజేందర్‌సింగ్, శ్రీనివాస్, జక్కుల రాము, ఎం.రుక్మిణి, ఇక్బాల్, వామన్, కార్మికులు సైఫ్‌ఖాన్, డీ.ప్రశాంత్, ఇమ్రాన్‌ఖాన్, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేస్తున్న మంగం విషంరావు

'గోండి భాషను సంస్కృతీ, సంప్రదాయాల రక్షణకు సహకరించాలి'

ఉట్నూర్, మార్చి12: గోండి భాష సంరక్షణతో పాటు సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడాలని రాజ్‌గోండు సేవ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషంరావు కోరారు. ఈ మేరకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తాకు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా రాజ్‌గోండు సేవ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషంరావు మాట్లాడుతూ గోండి భాష అభివృద్ధి కోసం.. అట్లాగే గోండి భాషని రాజ్యాంగంలో ఎనిమిదవ షెడ్యుల్లో చేర్చితే.. ప్రతీ కాంపిటేటివ్ ఎగ్జామ్‌లో గోండి భాష లో రాయవచ్చు అని, ప్రతీ గ్రామంలో గోండి పాఠశాలలు ఏర్పాటు చేసుకోవచ్చని, మాతృ భాష అయిన గోండు భాషని మనం రక్షించిన వారమవుతామని ఆయన పేర్కొన్నారు. దాదాపు 3లక్షల గోండి పదాలను ఆన్‌లైన్‌లో చేర్చుటకు ఐటీడీఏ పీవో సహకరించాలని, గోండి ధర్మము కోసం గోండి సంస్కృతీ, సంప్రదాయాల గురించి ప్రత్యేక కాలం ఉండేలా అమలు చేయుటకు ప్రస్తుతం ఢిల్లీ నుంచి గల్లీ వరకు అనేక పోరాటాలు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా ఐటీడీఏ తరపున గోండులకు సంబంధించి పుస్తక రచనకు సహకరించాలని ఆయన కోరారు. గోండులకు సంబంధించిన సెలవులను మంజూరు చేయాలని, ఇతర సెలవుల వల్ల ఆదివాసీ పిల్లలు చాలా నష్టపోతున్నారని, దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఆయన కోరారు. ప్రతియేటా పుష్యమాసంలో జంగుబాయి దీక్షను కొన్ని వేల మంది గిరిజనులు జంగుబాయి దీక్ష తీసుకోవడం వలన చెడు అలవాట్లకి దూరమై ఒక సన్మార్గంలో నడుస్తున్నారని, జైనూర్ మండలం జంగావ్‌లోని దీక్ష భూమికి అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇందులో జిల్లా మేడి మెస్రం దుర్గు, తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్, జిల్లా అధ్యక్షుడు పుర్కబాపురావు, అట్లాగే తోటి సంఘం మాజీ అధ్యక్షుడు మర్సకోల తిరుపతి, నాయక్ పోడు సంఘం నాయకులు, పర్ధాన్ సంఘం నాయకులు, కోలాం సంఘం నాయకులు, పేసా కోఆర్డినేటర్ అర్కవసంత్‌రావు, సార్‌మేడిలు పర్చకి ఆనంద్‌రావు, ఆడ షేకురావు, తదితరులు పాల్గొన్నారు.

'త్రిఫేజ్ ఉచిత విద్యుత్ కల్పించాలి'

ఉట్నూర్, మార్చి 12: ఐటీడీఏ ద్వారా ఆదివాసీ రైతులకు వ్యవసాయం కోసం త్రిఫేస్ ఉచిత కరెంట్ సౌకర్యం కల్పించాలని ఆదివాసీ గిరిజనులు కోరుతున్నారు. ఈ మేరకు జిల్లాలోని బోథ్ మండలం పాట్నాపూర్‌కు చెందిన ఆదివాసీ గిరిజనులు మంగళవారం ఐటీడీఏకు తరలివచ్చారు. పీవో అందుబాటులో లేకపోవడంతో ఐటీడీఏ పరిపాలన అధికారి సున్నం రాంబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడందెబ్బ జిల్లా అధ్యక్షులు పుర్కబాపురావు మాట్లాడుతూ త్రిఫేజ్ విద్యుత్ సౌకర్యం వెంటనే కల్పించడానికి ఐటీడీఏ అధికారులు ప్రత్యేక చొరవ చూపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ పంద్రంశంకర్, తొడసం గోపాల్ తదితర ఆదివాసీ రైతులు పాల్గొన్నారు.

'రైతులు మోసపోవద్దు'

తాంసి, మార్చి12: ప్రైవేట్ వ్యాపారులకు శనగ పంటను రైతులకు అమ్మి మోసపోవద్దని మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ ప్రెసిడెంట్ ధనుంజయ్ అన్నారు. మంగళవారం తాంసి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు నాణ్యమైన శనగ పంటను తేవాలని, త్వరలో ఆయా గ్రామాల రైతులకు నిర్దిష్టమైన సమయాన్ని వెల్లడిస్తామని తెలిపారు.

రంజాన్ వేళలు

బుధవారం	గురువారం
ఇఫ్తార్	సహర్
సా.6.31	ఉ.5.03



సహనం కలవారికి అల్లాహ్ ఎల్లప్పుడు తోడుగా ఉంటాడు. వారిని ఎల్లవేళలా రక్షిస్తాడు.

'తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు'

నేరడిగొండ, మార్చి 12: గ్రామాలల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రాజ్‌వీర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎంపీడీవో సమావేశం మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీసిబ్బంది గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందులో ఎంపీవో లక్ష్మణ్, ఏపీవో వసంత్‌రావు, ఏఈఈలు, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో రాజశేఖర్, మండల అధికారులు, గ్రామ సెక్రెటరీలు పాల్గొన్నారు.


బోథ్: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని మండలం ప్రత్యేక అధికారి డీఎస్‌వో కిరణ్ పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో రమేష్, ఎంపీవో మహేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆయన గ్రామ కార్యదర్శులకు నీటి ఎద్దడి నివారణపై వివరించారు. డీఎస్‌వో మాట్లాడుతూ గ్రామాల్లోని బోరు బావులు మరమ్మతులు చేయించాలని, మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలన్నారు. ఇందులో డిప్యూటీ తహసీల్దార్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

'సమయపాలన పాటించాలి'

ఇచ్చోడ, మార్చి 12: ఉపాధ్యాయులందరూ సమయపాలనా పాటించాలని కోకస్‌మన్నూర్ కాంప్లెక్ ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, రూంటూరిడ్ కోఆర్డినేటర్ ఉదయశ్రీ అన్నారు. మంగళవారం కోకస్‌మన్నూర్ కాంప్లెక్స్ పరిధిలోని దరంపూరి, చించోలి, నలేగావ్, గేర్జం, జామిడి ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల సామర్థ్యలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ దుక్రె శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పోషణ పక్షం : సూపర్‌వైజర్

ఇచ్చోడ, మార్చి 12: మహిళలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ కోసం ఏర్పాటైన అంగన్‌వాడీ కేంద్రాలను పక్కాగా నిర్వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమారాణి పేర్కొన్నారు. పోషకాహార లోపం, పూర్వ ప్రాథమిక విద్య మొదలు లక్ష్యంగా పోషణ పక్షం-2024 కార్యక్రమాన్ని అన్ని కేంద్రాల్లో నిర్వహించాలన్నారు. మంగళవారం మండలంలోని బోరిగామ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి అరుందతి, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నీరు లేక వెలవెలబోతున్న గడ్డెన్న వాగు ప్రాజెక్టు



జల గోస!

- జిల్లాలో రోజురోజుకూ అడుగంటుతున్న భూగర్భ జలాలు
- ఎండిపోతున్న పంట పొలాలు
- నెల రోజుల్లోనే మీటర్ లోతుకు పడిపోయిన నీటిమట్టాలు
- చివరి ఆయకట్టుకు నీరందించడం ప్రశ్నార్థకమే..
- ప్రాజెక్టుల పరిస్థితి దయనీయం
- బోరుబావులకు ఇక కష్టకాలం
- తీవ్ర ఆందోళనలో రైతులు

ఆంధ్రజ్యోతి ఫోకస్

నిర్మల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వాతావరణ పరిస్థితుల మార్పుతో భూగర్భ జలమట్టం గణనీయంగా పతనమవుతోంది. భూమిలో రోజురోజుకూ జలం ఇంకిపోతుండడం, రిజర్వాయర్‌లో నీటి మట్టాలు పడిపోతున్న కారణంగా పంట పొలాలకు సాగునీరు అందడం ఇక కష్టంగా మారుతోంది. నెల రోజుల్లోనే మీటరున్నర లోతులోకి భూగర్భ జలం పడిపోయినట్లు అధికారులు చెబుతున్న లెక్కలు అటు రైతులను, ఇటు వ్యవసాయాధికారులను ఆందోళనకు గురి చేస్తోంది. గత నెల రోజుల వ్యవధిలోనే భూగర్భ జలాల నీటిమట్టం క్రమ క్రమంగా పాతాళంలోకి చేరుకుంటుండడం అంతటా ఆందోళన కలిగిస్తోంది. గత నెల ఫిబ్రవరి 9వ తేదీన 9.1 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలం ఈ నెలలో 7.8 మీటర్ల లోతుకు పడిపోయింది. దాదాపు మీటరున్నర లోతులోకి నీరు ఇంకిపోవడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. దీని కారణంగా బోరు బావుల నుంచి నీరు పంట పొలాలకు పూర్తి స్థాయిలో అందించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మొన్నటివరకు నీటిధారలు కురిపించిన బోరుబావులు ప్రస్తుతం సన్నటి ధారలతో సరిపెడుతున్నాయి. దీంతో పాటు పంట పొలాలకు సాగునీరు అందించే ప్రాజెక్టుల్లో కూడా నీరు అడుగంటిపోతుండడం రైతాంగాన్ని కుంగదీస్తోంది. ఈ ప్రభావం రబీ పంటలపై పెద్దఎత్తున ఉంటుందని చెబుతున్నారు. జిల్లాలోని స్వర్ణ, గడ్డెన్నవాగు ప్రాజెక్టులతో పాటు ఎస్సారెస్పీ పరిధిలోని సరస్వతీ కాలువకు కూడా నీటి గండం వెంటాడుతోంది. ఇప్పటికే కడెం ప్రాజెక్టులో నీరు పూర్తిగా డెడ్‌స్టోరేజీకి చేరుకున్న కారణంగా ఈ ప్రాజెక్టు పరిధిలో క్రాప్ హాలీడే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రాప్ హాలీడే కారణంగా రబీ సీజన్‌లో దాదాపు 68వేల ఎకరాల పంట పొలాల భూములు బీడుగా మారిపోయాయి. ప్రాజెక్టుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతున్నందువల్ల రబీ సీజన్ చివరి వరకు పంటలకు సాగునీరు అందించడం కష్టతరమేనంటున్నారు.

ప్రాజెక్టుల పరిస్థితి దయనీయం..

సారంగాపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్టులో కూడా నీటి మట్టాలు రోజురోజుకూ వేగంగా తగ్గిపోతుండడం ఆందోళనకు గురి చేస్తోంది. ఈ ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 1183 అడుగులు కాగా.. ప్రస్తుతం 1175 అడుగుల్లో నీటిమట్టం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే నీటిమట్టాలు వేగంగా పడిపోతున్న కారణంగా దాదాపు 10వేల ఎకరాల పంట పొలాలకు సీజన్ చివరి వరకు నీరు అందించడం అధికారులకు సవాలుగా మారనుంది. అలాగే గడ్డెన్న వాగు ప్రాజెక్టు పరిస్థితి కూడా ఇదే మాదిరిగా ఉందని అంటున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 358.7 మీటర్లు కాగా.. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో 357.30 మీటర్లలో నీటిమట్టం ఉంది. యాసంగి పంటలకు ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి 90 క్యూసెక్కుల నీటిని అందిస్తున్నారు. గరిష్ఠంగా 14వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా.. ప్రస్తుతం 8వేల ఎకరాలకు కూడా పూర్తిస్థాయిలో సాగునీరు అందించలేని పరిస్థితులు ఉన్నాయి. కడెం ప్రాజెక్టులో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకి చేరుకున్న కారణంగా రైతులు రబీ పంటలపై ఆశలు కోల్పోయారు. అధికారులు సైతం ఈ ప్రాజెక్టు కింద క్రాప్ హాలీడేను ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం దాదాపు 68వేల ఎకరాల పంట పొలాలు వృథాగా మారిపోయాయి. ఖానాపూర్, కడెం ప్రాంతాల్లోని దాదాపు 13వేల ఎకరాల భూములకు సాగునీరు అందించే సదర్‌మాట్ బ్యారేజీ కూడా రైతులను ఆదుకునే పరిస్థితులు లేవంటున్నారు. ఈ సదర్‌మాట్ బ్యారేజీకి ఎస్సారెస్పీ నుంచి ఆశించిన మేరకు నీరు విడుదల కాకపోతున్న కారణంగా పంటలకు నీరందించలేని పరిస్థితులు నెలకొన్నాయంటున్నారు. ప్రస్తుతం కేవలం 200 క్యూసెక్కుల నీరు మాత్రమే ఎస్సారెస్పీ నుంచి సదర్‌మాట్‌లోకి విడుదల చేస్తున్నారు. అలాగే సరస్వతీ కాలువ పరిస్థితి కూడా దయనీయంగానే ఉందని అంటున్నారు. ఈ కాలువ ద్వారా ఆన్ ఆఫ్ పద్ధతిలో నీరును విడుదల చేస్తున్నారు. మొత్తం 35వేల ఎకరాలకు ఈ కాలువ ద్వారా సాగునీరు అందించాల్సి ఉంది. అయితే ఎస్సారెస్పీలో నీటి మట్టాలు తగ్గుతున్న కారణంగా ఏడు రోజులు ఆన్ మరో ఏడు రోజులు ఆఫ్ పద్ధతిలో నీటిని ఈ కాలువకు అందిస్తున్నారు. దీంతో అధికారులు ఆన్ సమయంలో తూముల ద్వారా పంటలకు నీరును విడుదల చేస్తున్నారు. దీంతో పంటలు ఎండిపోయి.. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సాగు లక్ష్యం గణనీయం

ఈ రబీ సీజన్‌లో పంటల సాగు లక్ష్యాన్ని అధికారులు గణనీయంగా నిర్ధారించారు. భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్న కారణంగా సాగు లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరడం కష్టమంటున్నారు. మొత్తం 2.90లక్షల ఎకరాల్లో ఈ రబీ సీజన్‌కుగాను వివిధ రకాల పంట పొలాలను సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో 1.10లక్షల ఎకరాల్లో వరి పంట, 1.03లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటలను సాగు చేయాలని నిర్ధారించారు. దీంతో పాటు 57,500 ఎకరాల్లో శనగ, 6500 ఎకరాల్లో నువ్వు, 14,500 ఎకరాల్లో జొన్న, 800 ఎకరాల్లో ఎర్రజొన్న, 600 ఎకరాల్లో పొద్దు తిరుగుడు పంటలను సాగు చేశారు. గత రబీ సీజన్ కన్నా ఈ సారి మొక్కజొన్న పంటను 20వేలు అదనంగా ఎక్కువగా సాగు చేస్తున్నారు. గత రబీలో 83వేల ఎకరాల్లో సాగు చేయగా ఈ సారి 1.10లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తుండడం గమనార్హం.



బోరుబావులకు కష్టకాలం!

ఇదిలా ఉండగా.. బోరుబావులపై ఆధారపడి సాగవుతున్న పంట పొలాలకు ఇక కష్టకాలం తప్పేట్లు లేదు. రోజురోజుకూ భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్న కారణంగా బోరుబావులన్నీ బోరుమంటున్నాయి. మొన్నటి వరకు పుష్కలంగా నీరు అందించిన ఈ బోరుబావులు ప్రస్తుతం భూగర్భ జలాలు తగ్గిపోతున్న కారణంగా పూర్తిస్థాయిలో నీటిని ఎత్తిపోయడం లేదంటున్నారు. ఉచిత కరెంటు రైతులకు అందుబాటులో ఉంటున్నప్పటికీ.. పడిపోతున్న భూగర్భ జలాల ద్వారా బోరుబావులు ఆశించిన మేరకు సాగునీరును అందించలేకపోతున్నాయంటున్నారు. మరో వారం పది రోజుల్లో భూగర్భ జలాలు మరింత తగ్గిపోనున్న కారణంగా పంట పొలాలకు ఇక సాగునీరు అందించడం కష్టం కానుందంటున్నారు. మరో నెల రోజుల వరకు పంటలన్నింటికీ సాగునీరు తప్పనిసరికానున్న కారణంగా రైతులు ప్రస్తుత పరిస్థితులను బేరీజు వేసుకొని ఆందోళనకు గురవుతున్నారు.



నీరు లేక కళ తప్పిన సదర్మాట్ ఆనకట్ట



కడెం ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీకి చేరిన నీరు



సరస్వతీ కెనాల్‌లో అంతంత మాత్రంగానే ఉన్న నీటి నిల్వలు



మహిళా శక్తి సదస్సుకు ఐకేపీ మహిళలు

దిలావర్‌పూర్, మార్చి 12 : హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మహిళా శక్తి సదస్సుకు మంగళవారం దిలావర్‌పూర్ ఐకేపీ మహిళలు బయలుదేరి వెళ్లారు. ఏపీఎం సులోచన రెడ్డి నేతృత్వంలో ఐకేపీ సీసీలు, వీవోఏలు, గ్రామాఖ్య సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు తరలి వెళ్లారు.

మానవత్వం చాటుకున్న ఏపీఎం

తానూర్ : తానూర్ మండలం ఏపీఎం మానవత్వాన్ని చాటుకున్నాడు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం జరిగే మహిళా శక్తి సభకు తానూర్ నుంచి స్త్రీ శక్తి మహిళా విభాగం సభ్యులు ఏపీఎం నారాయణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. అయితే వెళ్లే క్రమంలో నిజామాబాద్ జిల్లా నవీపేట్ వద్దకు బస్సు చేరుకోగానే డ్రైవర్‌కు గుండె సమస్య వచ్చింది. దీంతో బస్సులో ఉన్న ఏపీఎం నారాయణ్‌రెడ్డి, సీసీ భోజన్న, శివరాంలు గమనించి వెంటనే స్పందించి సీపీఆర్ చేసి మానవత్వం చాటుకున్నారు. నవీపేట్‌లోని ఓ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి, ఆ తర్వాత నిజామాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం డ్రైవర్ పరిస్థితి నిలకడగా ఉంది.

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

నిర్మల్ కల్చరల్, మార్చి 12 : దేశ పురోభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. మహిళా అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మహిళలు అనేక రంగాల్లో పురోభివృద్ధి సాధిస్తున్నారన్నారు. మహిళలకు ఓటు హక్కు కల్పించిన తరువాత వారి పురోగతి ప్రారంభమైందన్నారు. జిల్లాకు మహిళా ఎస్పీ ఉండడం గర్వకారణమన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులపై అందరూ కలిసికట్టుగా పోరాడాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలు వంద శాతం ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు అనే సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. వాటిని మహిళలు ఉపయోగించుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ... మహిళా సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పోషణ పక్షం పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఇటీవల నిర్వహించిన ముగ్గుల పోటీ, మెహందీ పోటీల్లో గెలుపొందిన మహిళలకు కలెక్టర్ బహుమతులు అందజేసి సన్మానించారు. పలు పాఠశాలల విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీడబ్ల్యూవో రమేష్, సీపీఓ మల్లికార్జున్, ఎల్డీఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వాటోలిలో షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధం

లోకేశ్వరం, మార్చి 12 : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధమై తీవ్ర నష్టం వాటిల్లింది. రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వాటోలి గ్రామానికి చెందిన శివరాత్రి, ఎగ్గాం పెద్ద భూమన్న, ఎగ్గాం నడిపి సాయన్నల ఇళ్లల్లో మంగళవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్ జరగగా.. ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇందులో టీవీ, కంప్యూటర్, తదితర విలువైన వస్తువులు కాలి బూడిద కాగా.. పెద్ద ఎత్తున ఆస్తి నష్టం వాటిల్లింది.

కిష్టాపూర్‌లో రెండు ఇళ్లల్లో చోరీ

లోకేశ్వరం : లోకేశ్వరం మండలంలోని కిష్టాపూర్‌లో సోమవారం రాత్రి రెండు ఇళ్లల్లో చోరీ జరిగింది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టాపూర్‌కు చెందిన కొండూరు సురేష్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు దిలావర్‌పూర్ మండలంలోని బన్సపెల్లి గ్రామానికి సోమవారం రాత్రి శుభకార్యానికి వెళ్లారు. గుర్తు తెలియని దొంగలు అతని ఇంటి తాళంతో పాటు తమ్ముడు నవీన్ ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో గల 15 గ్రాముల బంగారంతో పాటు నగదును చోరీ చేశారు. మంగళవారం గమనించి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే క్లూస్ టీం సభ్యులను రప్పించి వేలిముద్రలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



పరిశీలిస్తున్న క్లూస్ టీం సభ్యులు

నిరాహార దీక్ష



ఐకే రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దు..

లక్ష్మణచాంద : మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దని మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం ముందు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఓడ్నాల రాజేశ్వర్ మాట్లాడారు. ప్రజలు తిరస్కరించినప్పటికీ స్వలాభం కోసం అధికార పార్టీ అయిన కాంగ్రెస్‌లో చేరేందుకు ఐకే రెడ్డి యత్నిస్తున్నాడని మండిపడ్డారు. అక్రమ ఆస్తులను కాపాడుకోవడం కోసం కుటిల యత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అబ్బిడి ప్రతాప్ రెడ్డి, అట్ల రామ్‌రెడ్డి, మేడి నారాగౌడ్, ఈటెల శ్రీనివాస్, కొంద్ర నరేష్ రెడ్డి, అట్ల చిన్న రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

బిల్లు బారులు



జీరో బిల్లు ఇప్పించండి సారూ..

భైంసా రూరల్, మార్చి 12 : లబ్ధిదారులందరికీ మార్చి నెల నుంచి జీరో బిల్లు వస్తుందని ప్రకటించడంతో.. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి బారులు తీరారు. ఉదయం నుంచే మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు మండల కార్యాలయానికి చేరుకున్నారు. తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు గంటల తరబడి బారులు తీరారు. అధికారులు సైతం కార్యాలయానికి వచ్చిన లబ్ధిదారుల నుంచి ఓపిగ్గా వివరాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ అసిస్టెంట్ సురేష్ గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్త జన సందడి



చించోలిలో ఘనంగా మల్లన్న జాతర

సారంగాపూర్ : మండలంలోని మలక్ చించోలి గ్రామ సమీపంలో గల మల్లన్న దేవాలయం జాతరను ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఏడాది ఆనవాయితీగా మహిళలు నూతన వస్త్రాలను ధరించి అంబళ్లను నెత్తి పైన ఎత్తుకొని డప్పు మేళాల మధ్య గ్రామాల్లోని వీధుల్లో ఊరేగింపుగా వెళతారు. ఆ తర్వాత ఆలయం వద్దకు చేరుకొని పూజలు చేసి అంబళ్లను మల్లన్నకు నైవేద్యంగా సమర్పించడంతో జాతర మొదలైంది. దీంతో సోమవారం జరిగిన జాతరకు మండలంలోని ఆయా గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని చర్యలు తీసుకున్నారు.

దంపులపై దాడులు



70 ట్రాక్టర్ల ఇసుక స్వాధీనం

నర్సాపూర్(జి) : మండలంలోని అర్లి(కె) గ్రామ శివారులో మంగళవారం రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖాధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి 70ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. వాసాల లింగారెడ్డి వ్యవసాయ భూమిలో 40ట్రాక్టర్ల ఇసుక, చర్చి వద్ద 15ట్రాక్టర్ల ఇసుక, కసిరె రాములు ఇంటి వద్ద 15 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసి అర్లి(కె) గ్రామ పంచాయతీ సెక్రెటరీ పద్మజకు అప్పగించారు. దాడుల్లో తహసీల్దార్ సోమ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్, ఎస్సై ఎం.హన్మాండ్లు, మైనింగ్ ఏడీ క్రాంతికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.